# విషాదవినోదిని

అది కాలేజీకి వెళ్ళే అడ్డదారి. దాని కటూ ఇటూ కొండల్లాంటి మేడలు. ఆ మేడల మధ్యన సెలయేరులా ఆ దారి సముద్రంలాంటి కాలేజీలో కలుస్తూంటుంది. కాలేజీ విద్యార్థులుకూడా ఆ దారమ్మటే తారాజువ్వల్లా రివ్వున సైకిళ్లమీద దూసుకుపోతారు. ఏమంటే ఆ మేడల నీడల్లో ఆడవాళ్ల జాడలున్నాయి. కొంతమంది కాలేజీ గరల్సుకూడా అక్కడే ఉంటున్నారు. ఏదిఏమైనా పుష్పాల చుట్టూ భ్రమరాలు పరిభ్రమించడం తప్పులో లెక్కకాదుగా!

మత్తేభంలా ఉన్న పశ్చిమాద్రిమీదికి ఆకలిగా ఉన్న సింహంలా సూర్యుడు ఉరుకుతున్నాడు. ఆ చోద్యాన్ని పరిహసిస్తూ అప్పుడే తారలు వస్తున్నాయి. వేళాకోళంగా కన్నులు గీటుతున్నాయా అన్నట్లు మిళుకు మిళుకుమంటూ ఆరబోసిన మణుల్లా ఉన్నాయి. వాటిని అదుపులో పెట్టడాని కావేళ చందమామ లేడు. కాబట్టి అది అమావాస్య అనుకోవచ్చు. స్వర్గానికి నిచ్చెనమెట్లలా మోడువారినవానికి ఆశాజ్యోతుల్లా వీథిదీపాలుమాత్రం వెలుగుతున్నాయి, రెండు ఫర్లాంగుల కొకటి చొప్పున. కానీ ఆ కాలేజీ అడ్డదారిలో మాత్రం లైట్లు లేవు. నడుం విరిగిన నల్లతాచులా పడి మూలుగుతూంది ఆ నిశీథిని.

ఆ దారినే మెయిన్‌రోడ్డుకు కలిపే చిన్న నల్లికిల పాములాంటి బాట ఒకటి ఉంది. ఆ రెండు దారులు కలిసేచోట ఓ పెద్ద భవంతికూడా ఉంది, హారంలో తరళమణిలా. అప్పుడింకా పదిగంటలైనా అయిఉండదు. కానీ ప్రళయకాలంనాటి రాత్రి నల్లటి చీకటి రగ్గుతో ముసుగు వేసుకున్నట్లుగా ఉంది.

బెల్లు, బ్రేకు, లైటు లేని ఓ సైకిలుమీద యౌవనగరువంచే పొంగిపోతున్న ఓ షోకిల్లా పాడుకుంటూ, జోరుగా తొక్కుకుంటూవచ్చి, ఆ దారి మలుపు తిరగబోయి ధామ్మని పడ్డాడు అక్కడఉన్న గోతిలో. మరి ఆ గొయ్యి సామాన్యమా! అది మునిసిపాలిటీ వాళ్ళపంపుల కనెక్షన్‌కోసం తీసినదాయె! వెంటనే పక్క భవంతిలోనించి "వాసూ!" అని ఓ కంగారు గొంతు.

వాసుకి కళ్ళు బైర్లు కమ్మేశాయి. తనకి ఈ మూడేళ్లల్లోను ఏమి తెలియనటువంటి ఆ దారుల్లో, ఆ మేడల్లోనించి ఏమిటా వికృతనాదం? ఒళ్ళు మండిపోయింది. సైకిలుమీదనించి పడటం ఓ పెద్ద అవమానం! దానికితోడు ఆ పాడుపిలుపు! తల చితక కొట్టినపాములా తయారయ్యాడు. కాళ్ళు, వేళ్ళు చూసుకున్నాడు తడిమి. చిప్ప లెగిరిపోలేదుకానీ పొప్పర్లు రేగిపోయాయి. కొద్దిగా బట్టలకు ఎర్రటి రక్తం ముద్రలు వేసింది. పుట్టెడు దుఃఖం ముంచుకు వచ్చింది. బారుమందామనుకొని తమాయించుకున్నాడు. టార్చిలైటుతో వస్తున్న ఆ పెద్దమనిషిని, మునిసిపాలిటీని కోడళ్లుచేత వాతలు తిన్న గయ్యాళి అత్తలా దుమ్మెత్తి పోస్తున్నాడు.

"వాసూ!" మళ్లీ దగ్గిరగా ఆయన కంఠం.

"... ... ..."

ఆయన టార్చి వాసుకి ఇచ్చి గోతిలో ఉన్న సైకిలు బయటికి తీశారు. లైటు వేసి వాసు సైకిల్ ఓమారు పరీక్షగా చూశాడు. అది రోట్లో తొక్కిన అప్పడాలపిండిలా తయారయింది. ప్రేమించి పెళ్లాడిన పెళ్లాం చనిపోయినంతగా వాసుకి దుఃఖం ముంచుకు వచ్చింది. ఏమంటే ఆ సైకిలు లాటరీలో ఒక్క రూపాయకు వచ్చినదాయె!

"వాసూ! లోపలికిరా!" అంటూ ఆ అపరిచిత వ్యక్తి పిల్లవాణ్ణి అడ్డాల్లో వేసుకున్నట్లు, ఆ సైకిలు నెత్తుకొని భవంతి వరండాలోకి నడవసాగారు. ఆయనెవరో గుర్తుపట్టలేక వాసు సతమతమయిపోతున్నాడు. ఇంతలో వరండాలో లైటు వెలిగింది. వాసు ప్రాణం చివుక్కుమంది, ఈయనకాక ఇంట్లో మరో గ్రహం ఉన్నట్లుందని. ఆ వెలుగులో ఆయనెవరో పరీక్షగా చూశాడు వాసు, మెడికల్ ఆఫీసరులా. ఆయనెవరోకాదు, వాళ్ల ఊరు రామనాథంగారే. కొద్దిగా తనకు బంధుత్వం కూడా ఉంది. పాపం, ఆయనకు తనంటే మొదటినించి ప్రాణం. తన చదువు, మార్కులు చూసి మురిసిపోతూండే వారు. తన కాయనవద్ద చనువు లేకపోయినా, ఆయనకు తనమీద ఆప్యాయత ఉంది. స్వగ్రామంలో ఆయన ఇంటికి తనెప్పుడూ వెళ్లి ఎరగడు. కానీ తన తండ్రికి, ఆయనకి ఒక్కటే ప్రాణం. తనెక్కడైనా కనబడితే ఆయనే ముందుగా పలకరించేవారు. ఇంతకీ రామనాథంగారక్కడ ఎందుకుఉండవలసివచ్చిందోమాత్రం అర్థం కాలేదు.

"మీరా!" అయోమయంగా వాసు ఓ పిచ్చికేక వేశాడు.

"అవును, నాయనా, నేనే. రా లోపలికి."

ఇద్దరు హాల్లోకి వెళ్లారు. అక్కడ చక్కగా అమర్చబడిఉన్న గాద్రేజిటేబులు, డన్‌లప్ సోఫాలు, ఈజీచైరులు ఉన్నాయి. వాసు ఓ దానిమీద చతికిల బడ్డాడు, మోకాళ్ళు పట్టుకొని, ఆ రక్తపుమరక లాయన ఎక్కడ గుర్తిస్తాడోనన్న భయంతో. ఆయన చూడనే చూశారు. ఒక్క అరుపు అరిచారు, "అమ్మాయ్! ఆ వాసలేన్ ఇలా పట్రా" అంటూ.

ఒక్క క్షణం చచ్చిపోయిందో లేదో వాసలేన్‌సీసాతో ఓ అందాలరాణి ఆవిర్భవించింది. వాసుకి ఒళ్ళు మంటలు ఒక్కసారిగా చల్లారిపోయాయి. ఆమె నలాగే కళ్లతో తినెయ్యడం మొదలుపెట్టాడు. ఇప్పుడతనికి కాళ్లకి కాళ్ళు, చేతులకి చేతులు కోసుకుపోయినా ఫర్వా లేదు. ఏమంటే అతనప్పుడు పెద్ద ఆపరేషన్‌చేసేటప్పుడు మత్తిచ్చిన రోగిలా ఉన్నాడు. ఆ మైకంలోనే "సరోజా! నిజంగా నువ్వేనా?" అని కేకవేశాడు. అదంతా అసంకల్పితచర్య ప్రభావం. దానికి వాడు బాధ్యుడు కాదు మరి!

నేనేనన్నట్లు సరోజ తలఊపి లోపలికి వెళ్లిపోయింది. వాసు తేరుకున్నాడు. కొట్టుకుపోయినచోట్ల వాసలేన్ రాసుకుంటూ జాలిగా రామనాథంగారివంక చూశాడు. ఆయన ఇంక అందుకున్నారు అసలు పురాణం.

"వాసూ! సరోజకి హైద్రాబాదులో పి. యు. సి. పూర్తిఅయింది. బి. ఏ. చదవాలని దాని సరదా. నేనుమాత్రం ఎందుకు కాదనాలని తీసుకువచ్చి ఇక్కడ కాలేజీలో చేర్పించాను. సరే, కాలేజీకి దగ్గిరగా ఉంటుంది కదా అని ఈ కింది పోర్షన్ అద్దెకు తీసుకున్నాను. మేం వచ్చి ఓ పదిరోజులకంటే ఎక్కువకాదు."

వాసు చిన్నగా నవ్వాడు.

ఇంతలో సరోజ కాఫీ పట్టుకువచ్చింది. తాగమని బలవంతపెట్టింది. ఆ కాఫీతోబాటు సరోజ సౌందర్యాన్ని కూడా తాగేశాడు వాసు.

"ఏం వాసూ! ఈ చీకట్లో ఇలా బయలుదేరావు?" చుట్ట వెలిగించి పొగ వదులుతూ రామనాథంగారు అడిగారు.

వాసు కంగారుగా మొహమాటపడ్డాడు. అయినా చెప్పక తప్పిందికాదు. కొంచెం ఊపిరి బిగపట్టి "మొదటి ఆట సినిమాకి వెళ్లి, మెయిన్‌రోడ్డున వస్తే లైటులేని సైకిలు పోలీసు పట్టుకుంటాడని ఈ అడ్డదోవ పట్టిస్తే గడ్డుసమస్య ఎదురయ్యింది" అన్నాడు. మళ్లీ ఊపిరి పీల్చి సైకిలువైపు చూశాడు. సరోజ కిలకిలా గట్టిగా నవ్వేసింది, పమిటచెంగు మూతి కడ్డుపెట్టుకొని. వాసు అల్లరిపెట్టవద్దన్నట్లు అనునయపూర్వకంగా సరోజను చూశాడు. రామనాథం గారు ఓ నవ్వు నవ్వి ఊరుకున్నారు. ఎందుకంటే ఆయనో రిటైర్డ్ పోలీసాఫీసరు.

సైకిలు అక్కడే వదిలేసి వాసు మెల్లిగా ముక్కుతూ, మూల్గుతూ రూమ్‌కి చేరుకున్నాడు.

* * *


మరునాడు ఉదయం ఓ కుర్రవాడు పరిగెత్తుకు వచ్చి "నా పేరు భద్రం. మా సరోజమ్మ మీ కీ కవరిమ్మన్నారు" అన్నాడు. ముఖం కడుక్కుంటూ వాసు వెనక్కి తిరిగి "ఆ టేబుల్‌మీద పెట్టి వెళ్ళు" అన్నాడు ముక్తసరిగా. వాడు చంగున నవ్వుకుంటూ ఎగిరిపోయాడు.

వాసు కవరు విప్పి చదవడం మొదలుపెట్టాడు. చిల్లుసంచిలో ముత్యాలు పోసి మోసుకుపోతూంటే అవి కిందపడగా ఏర్పడిన వరసలా ఉందా అక్షరవిన్యాసం. వాసు ఒక్కసారి తన చేతినికూడా చూసుకొని చదవడం మొదలుపెట్టాడు. ముందుగా "నమస్తే" కనిపించింది.

'ఆఁ. . . . మంచిది!' ఆత్మగతంగా అనుకున్నాడు.

"వాసూ!

నిన్న నీ సైకిలు ఆక్సిడెంటులో కిందపడిపోయిన



పర్సులో నీ ఎడ్రసు దొరికింది. ఏమీ అనుకోకు. మన కాలేజీ 'నాగార్జునసాగర్' ఎక్స్కర్షన్ విషయమై మా నాన్నగారు నీతో మాట్లాడాలనుకుంటున్నారు. వస్తావు కదూ!

నీ రాకకై.

సరోజ."

వాసు గబగబా బట్టలు మార్చుకొని, అద్దెసైకిలు మీద రామనాథంగారింటికి చేరాడు. ఆయన కాఫీ తాగుతూ వీథిలోనే కూర్చున్నారు. సరోజ లోపల జడ అల్లుకుంటూంది. చెప్పకుండా వాసు ఓ సోఫాలో కూర్చున్నాడు.

"ఏమోయ్! ఇలా వచ్చావు? నీ అప్పరసనైకిలు కోసమా?" రామనాథంగారు అమాయికంగా చమత్కరించారు, చుట్ట ముట్టిస్తూ.

వాసుకి పచ్చివెలక్కాయ గొంతున పడ్డట్టయింది. ఏదో గొణగబోయాడు.

"అదిగాదు, నాన్నా! మా కాలేజీ ఎక్స్కర్షన్ విషయం..." రిబ్బను వేసుకుంటూ వాసుకేసి చూసింది.

"అదా విషయం. ఇంతకీ నువ్వన్నమాట వాసుని రప్పించింది. ఆఁ... వాసూ! మీ కాలేజీవాళ్లు 'సాగర్'కి వెళుతున్నారటగా. సరోజకూడా వెళతానంటూంది. మరి నీ ఉద్దేశం ఏమిటి?"

"అంతమంది మగవాళ్లమధ్య తగుదునమ్మా అని సరోజ ఒక్కతే రావడం నిజానికి నా కిష్టంలేదు." కుండబద్దలు కొట్టినట్లు అనేశాడు వాసు, సరోజకేసి చూస్తూ. ఆమె బుంగమూతిపెట్టి గిర్రున తిరిగి, రయ్యిన వెళ్లిపోయింది.

'నిన్న సంయోగం, ఈవేళ వియోగం' అనుకున్నాడు వాసు బుజా లెగరవేస్తూ.

"అయితే అమ్మాయిని పంపించను!" రామనాథంగారి తీర్మానం.

వాసు లేచి వ్యాకులచిత్తంతో విల్సు హోటలు వైపు సైకిలు తొక్కుకుంటూ వెళ్లిపోయాడు.

* * *

అవి కాలేజీ బొటానికల్ గార్డెన్సు. దానిలో ఆర్ట్సు గ్రూపుల్లాంటి రోజాలు, సన్నజాజులు, సైన్సు గ్రూపు ల్లాంటి బ్రహ్మచెముడుడొంకలు, ముళ్లపొదలు ఉన్నాయి. సంపెంగతీగె ఐరన్వైరు ఆర్చీలమీదుగా పాకి, పక్కని ఉన్న లేబొరేటరీలో ప్రాక్టికల్సు చేస్తున్న యువతీయువకులకు మనఃప్రీతిగా ఉంది. సరోజ స్నేహితురాళ్లతో ఆ సంపెంగలవద్ద ముచ్చటలాడుతూంది. వాసు యథాలాభంగా ఆ వైపుగా పోతూ సరోజను చూశాడు. అప్రయత్నంగా అటు నడిచాడు. వాసుని చూసి సరోజ గిర్రున ముఖం తిప్పేసుకొని మిగిలినవాళ్లతో మాటలు కలపడం మొదలుపెట్టింది. ఆమె కింకా తనమీద కోపం పోలేదనుకున్నాడు వాసు. కాని కోపోపశమనమార్గంమాత్రం తెలియలేదు. దిక్కులు చూడడం మొదలుపెట్టాడు. మిగిలిన మగవాళ్లలాంటి ఆడవాళ్లంతా ఏకకంఠంతో "తమకేం కావాలి. మహాశయా!" అని అరుస్తూ మీద పడబోయారు.

"నా... కు..." నసిగాడు వాసు.

"నాను కావాలా." ఓ కొంటెకోణంగి చమత్కారం.

అందరు గొల్లుమన్నారు, విలన్స్లా నవ్వుతూ. వాసుకి అయోమయమయింది. ఏం మాట్లాడాలో తెలియలేదు. గుండె నిమిషానికి 92 సార్లు కొట్టుకుంటున్నట్లనిపించింది. చెమటలు పోసేస్తున్నాయి. ఎన్. సి. సి. కమాండరులా గట్టిగా అరుద్దామంటే మాట పెగల్లేదు. సరోజవైపు చూస్తూ అలాగే నిల్చుండిపోయాడు. గణగణా థర్డ్ బెల్లు మోగింది.

"లీవ్ ది బర్డ్ లోన్." ఓ సానుభూతి గొంతు. రిలీజ్డు పిక్చరు మాటినీ వదిలినట్లు తోసుకుంటూ, అల్లరి చేసుకుంటూ వాళ్లంతా వెళ్లిపోయారు. వాసుకి తల తిరిగిపోయింది. అక్కడే గేటు కానుకొని కూలబడిపోయాడు. సరోజ తన్నంతగా అవమానిస్తుందనుకోలేదు. ఏవేవో భావభ్రమరాలు తన మస్తిష్కకుసుమం చుట్టూ సుడులు తిరుగుతున్నాయి. అతన్ని ఆ స్థితిలో ఎవ్వరు గుర్తించలేదు, కనీసం తోటమాలైనా, ఎందుకంటే ఆతనో మొక్క మొదట్లో నిద్రపోతున్నాడు.

"వాసూ!" హసితంతో ప్రేమాహ్వానం.

వాసు ఉలిక్కిపడ్డాడు. అటు చూసి బింకంగా నడిచాడు.

"నేను, వాసూ, సరోజని."

"నువ్వెందుకు వచ్చావ్?"

"మరి నువ్వెందుకు వచ్చావ్?"

"నిన్నటి నా అభిప్రాయానికి క్షమాపణకోసం."

"నేను దాన్ని అంగీకరిద్దామని. నువ్వు వస్తావని నాకు తెలుసు. కాని అంతమందిలో వస్తావనిమాత్రం ఊహించలేకపోయాను."

"వస్తే ఏం?"

"ఇద్దరి ఆరోగ్యానికి భంగకరమని!" వాసూని తాకుతూ నవ్వింది.

వాసు నవ్వుకున్నాడు. 'అబ్బో, ఎంత చొరవో' అనుకున్నాడు. పైకి "నువ్వంతమందిని తప్పించుకుని ఎలా రాగలిగావు?" అన్నాడు ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడివేసి చూస్తూ.

"అదిగో అలా చూడు. పెన్ను కింద పడేశాను. దానికోసమని చెప్పి వచ్చాను." పెన్ను తీసుకోబోయింది.

"భలే యుక్తి!" వాసు ఒక రిమార్క్ ఇచ్చాడు.

"నా నెత్తి. నువ్వు మళ్లీ బాధపడి 118 డిగ్రీల జ్వరంతో మంచం ఎక్కుతావనే బెంగ!" కిందపెదవి నొక్కిపట్టి ఆడుతున్న నెమిల్లా ఊగింది.

"నామీద నీ కెందుకు బెంగ?" బాణంలా ఓ వచ్చుప్రశ్న.

"నాకెందుకెమిటే?....." ఏదో చెప్పబోయింది.

కానీ వాసుకళ్లు ఆమెను మాట్లాడనివ్వలేదు. సిగ్గు ఎర్రని బుగ్గలరూపంలో సాణివల్లవంలో చిక్కుకుపోయింది. అప్పటివరకు స్వతంత్రించి మాట్లాడిన

ఆ కంఠం జీరవోయింది.

"సరోజా!" వాసు వేడిగా కేకేశాడు.

"ఊఁ! ఎందుకు, వాసూ!"

వాసు ఏమీ మాట్లాడలేక పోయాడు. చటుక్కున ఆమె చేయి పట్టుకుని లాగాడు. ఎగిరివచ్చిన పిట్ట గూటికి చేరినట్టు ఆమె వాసువక్షఃస్థలంమీద పడింది. వాసు ఓ వెచ్చని ముద్దు పెట్టుకున్నాడు. తన్మయత్వంతో ఆమె వాసును గట్టిగా కౌగిలించుకుంది. ఈ వింతరహస్యాన్ని బహిరంగ పరుస్తున్న ఆ అపూర్వప్రేమికుల నభినందిస్తూ తోటలో పూలు తలలూపుతూ నాట్యం చేస్తున్నాయి. ఏక శరీరులై ఉన్న వారికి పిడుగులాంటి టంగ్‌మన్న గంట వినబడింది. సరోజ ఉలిక్కిపడింది. అపూర్వమైన ఆ సన్నివేశానికి మల్లెమొగ్గలా ముడుచుకుపోయింది. వాసు తేనెతాగిన తుమ్మెదలా సీత్కరించాడు. కంగారుగా సరోజ పుస్తకాలు సద్దుకొని "రాత్రి ఇంటికి రా, వాసూ!" అంటూ చకచకా వెళ్ళిపోయింది. వాసు వికలుడై రెండుజడలు వేసుకొని, పంజాబీడ్రెస్సులో వెనక్కి తిరగకుండా వెళ్ళిపోతున్న సరోజనలాగే చూస్తూ మైమరిచిపోయాడు.

* * *

వాసు రాత్రి భోజనం చేసి సరోజదగ్గిరికి వెళదామని బయలుదేరుతూంటే ఎదురుగా రామనాథంగారు వచ్చారు. 'శనిగాడు' అని మనస్సులో తిట్టుకున్నా వాసు ఆయన్ని లోపలికి తీసుకువచ్చి కూర్చోబెట్టి సరోజకి తీసుకువెడదామనుకున్న ఆపిల్సు, ద్రాక్ష ఆయన చేతిలో పెట్టాడు. "ఇవ్వన్నీ నా కెందుకు, నాయనా! నీ అభిమానంగానీ." ఆయన నవ్వుతూ అన్నారు.

"పెద్దవాళ్లని అలా గౌరవించడం నా కలవాటు. వాటిని ఉంచండి. ఇంటిదగ్గిరయినా వాటి వినియోగం కాకపోతుందా." కొంచెం మర్యాదగా వాసు సమాధానపరిచాడు.

యౌవనం జ్ఞాపకం వచ్చిన ముసలిబోగందానిలా ఆయన నవ్వుకున్నారు.

"మీ రిలా ఎందుకు వచ్చినట్టు?" వాసు ప్రశాంతత చీలుస్తూ చూశాడు.

"ఆఁ!. . . ఏమీలేదు. నేను మన ఊరు వెడుతున్నా. మీ నాన్నతో ఏమన్నా చెప్పమన్నావా?"

"ఏమున్నాయి చెప్పేందుకు? రేపు నాగార్జునసాగర్ వెళతామనిమాత్రం చెప్పండి."

"అలాగే." లేవబోతూ "చూడు, నాయనా! సరోజకి ఎకనమిక్సు అర్థంకావడంలేదట. కాస్త నీకు తెలిస్తే వెళ్ళి చెబుదూ!. . ."

"అలాగే!" 'ఆపిల్సు, ద్రాక్షకన్నా తియ్యటిమాటరా, నా చిట్టి తండ్రీ!' అనుకున్నాడు వాసు. అలాంటి పరిస్థితిలో సాగర్‌కి వెళ్ళకపోవడం శతవిధాల మేలనుకున్నాడు. రామనాథంగారు లేచి మెల్లిగా రిక్షామీద వెళ్ళిపోయారు.

* * *

మిత్రుల ప్రోద్భలంతో వాసు సాగర్‌కి వెళ్ళక తప్పింది కాదు. సరోజకో ఉత్తరం రాసి భద్రాన్ని పిలిచి ఇచ్చి రమ్మన్నాడు పోతూపోతూ. సరోజ చదవడం మొదలుపెట్టింది స్ప్రింగుచైరులో కాలుమీద

> **మనుషులు దూరమైతే మనసులు చేరువౌతాయంటారు. కాని అది పూర్తిగా నిజంగాదు. మనసులు చేరువైతే, మనుషులూ చేరువౌతారు. శాస్త్రంత విరాగం, విప్రలంభం, వేడివేడి నిట్టూర్పుల తర్వాత ఏర్పడే అనుభవమే మధురంగా ఉంటుంది.**

కాలు వేసుకొని.

"సరోజా!

ఏనాడు మనం కలుసుకున్నామో, ఆనాటినించి నా మనస్సు నీ రూపంగా మారి నన్ను మైమరిపింప జేస్తోంది. అనుభవశూన్యప్రేమికుడనైన నాకు నిన్ను గూర్చి ఏం రాయాలో తెలియడంలేదు. అనన్య లభ్యమైన ఓ ప్రత్యేక ఆకర్షణమాత్రం నీలో ఉందని చెప్పగలను. మీ నాన్నగారు లేని ఈ మధురక్షణాల్లో నిన్నెలాగైనా కలుసుకోగలను. కానీ నిజాయితీ అనే బంగారపుసంకెళ్లు నా కాళ్లను కదలనివ్వడంలేదు. మనస్సు రాయి చేసుకొని సాగర్‌కి వెడుతున్నా. నన్నపార్థం చేసుకోకు. నేనెవర్నీ ఏమీ కోరలేదు. కానీ ఇప్పుడు మాత్రం నానుండి నువ్వు దూరంకావడానికి ప్రయత్నించవద్దని అడుగుతున్నాను. నా కాత్మీయు రాలవు కావడానికి అనుక్షణం మార్గం యోచిస్తాను.

నీకోసం
వాసు."

సరోజ నిట్టూర్చి డ్రాయరు సొరుగులో ఆ ఉత్తరాన్ని పడవేసింది.

* * *

వాసు నాలుగు రోజుల్లో సాగర్‌టూర్ పూర్తి చేసుకొని డాం దృశ్యాలతో, లడ్డూ మిఠాయిలవంటి తీపిపదార్థాలతో ఏకాయెకీని రాత్రి తొమ్మిది రామనాథంగారింటిలో దిగాడు.

వరండా అంతా చీకటిగా ఉంది. మెల్లిగా సింహద్వారం వద్దకు చేరి కాలింగుబెల్లు నొక్కాడు. సరోజ వచ్చి తలుపు తీస్తూ "ఎవరండీ! ఏం కావాలి?" అంది మత్తుగా ఒళ్ళు విరుచుకుంటూ.

"నేనేనండీ! మీరు కావాలి!" అన్నాడు వాసు ఇకిలిస్తూ.

"ఛ! పొండి! రండి లోపలికి. ఇదే రావడమా సాగర్‌నించి?"

"మరేగానీ రామనాథంగారు ఊరునించి వచ్చారా?"

"లేదు. నే నొక్కదాన్నే బావురుమంటున్న ఈ ఇంటిలో ఉంటున్నా. నాకేమీ తోచడంలేదు."

"అందుకేగా నేను వస్త." సంచీ, బుట్టలు, తట్టలు దింపుతూ అన్నాడు.

"మీ రెందుకు?"

"నువ్వు ఏడుస్తూంటే చూసి నవ్వడానికి."

"అయితే ఉండండి ఏడుస్తాను."

**ఆచార్య తిరుమల**

"ఉండుండు. ఈ స్వీటు ఆరగించి ఏడు!" సరోజ నోటికో లడ్డూ అందించాడు. "అబ్బా! మరీ చిలిపి తనం!" తినడం మొదలుపెట్టింది.

"భద్రం ఏడి?"

"భద్రంగా నిద్రపోతున్నాడు."

"మరి నువ్వేం చేస్తున్నావు?"

"ఎకనమిక్సు చదువుకుంటున్నా. ఏమీ అర్థ మవడం లేదు. కాస్త చెబుతారేమిటి?"

"సరే పద ... "

గదిలో టేబిలుమీద టేబిల్‌లైటు పుస్తకాం మీదికి వంగిఉంది.

"అరే, ఈ లైటు పుస్తకాల్ని ముద్దు పెట్టుకుంటూందే!"

"ఛీ! పొండీ. మీ కెప్పుడూ ముద్దులూ, పద్దులూ తప్ప మరేం లేదా?"

"సరే తియ్యి. నీకు కావలిసిన టాపిక్కు" అంటూ అక్కడున్న కాగితాలూ, పెన్నూ సర్దుతూ నవ్వాడు. సరోజ పుస్తకం తెరవబోయింది. లైట్లారిపోయాయి. గదిఅంతా అంధకారంగా ఉంది. చాలాసేపటివరకు కరెంటు రాలేదు. సరోజ మనస్సులో అనేకమైన భావాలు వాయువీచికల్లా వీవసాగాయి.

'అలా వాసు ఏం మాట్లాడకుండా కూర్చున్నాడేం? అబ్బ, ఎంతటి నిగ్రహం! తాను కోరుకున్నవాడు, తనను వలచి ఆరాధించేవాడు ఎవరూ లేని ఈ చీకటిగదిలో ఎదురుగా ఉంటుంటే తన కింకా ఎందు కంత బిడియం? వాసు మళ్లీ తనను కౌగిలించుకొని ముద్దు పెట్టుకుంటే ఎంత బాగుండును! ఏమైనా వాసుకే తను అర్ధాంగి కావాలి. ఏమంటే అతను నిగర్వి, నిగ్రహశీలి. అన్నింటి కన్నా వాసు మహా రసికుడు. అతని ఒడిలో తను అమరత్వాన్నే ధిక్కరించాలి!'

సరోజ తీయని కోరికలతో సతమతమయిపోయింది. లేచి వాసు కుర్చీవద్దకు వెళ్ళి "వాసూ!" అని మీద పడబోయింది. లైట్లు వెలిగాయి. సరోజ నిర్ఘాంత పోయింది, వాసు స్థానంలో తన టయింటేబులు కార్డు చూసి. దానిమీద ఒలకబోసిన మిరియాల్లా అక్షరాలున్నాయి, "నేను వెళ్లిపోతున్నాను. ఈ లైట్లు లేని గదిలో మనమిద్దరం ఉండడం మంచిది కాదు" అని.

"ఎంత పని చేశావ్, వాసూ!" అంటూ సరోజ అశ్రుపూరితనయనాలతో భారంగా డన్‌లప్‌పిల్లోలో తలదాచుకుంది.

* * *

తరవాత వాసు ప్రతిరోజు వెళ్ళి సరోజకి పాఠం చెప్పటం మొదలుపెట్టాడు. అది అతని దైనందిన కార్యక్రమంగా మారిపోయింది. ఆఖరికి ఓ రోజు సరోజ అంది, "వాసూ, నీ అటెండెన్సు సెంటు పర్సెంటు" అని.

" మరి నేను మానేస్తే అమ్మాయిగారికి ఆవలింతలేగా." బాధ్యత వహించిన గొప్ప గురువులా ముఖం పెట్టాడు. సరోజ విరగబడి నవ్వింది, జారి పోయిన పవిట చూసుకోకుండా. వాసు ఆమెన అలాగే చూస్తూ ఉండిపోయాడు.


## ఏజంట్లు కావలెను

100% టెరిలిన్ షర్టుముక్కలు, పాంట్ ముక్కలు, చీరెలకు కమిషను లేక రు. 225/- నుంచి రు. 475/-వరకు జీతంమీద ఏజంట్లు కావలెను. షరతులకు, పూర్తి సైజు నిడివి ఉచిత శాంపిలుకు వ్రాయండి.

**SHAKTI AGENCIES (WAP)**
**Qutab Road, Delhi-6.**

## కావలెను

ప్రపంచ ప్రసిద్ధమైన మా **జపాన్ మాడల్ పాకెట్** ట్రాన్సిస్టర్‌కు ఆర్డర్లు సేకరించుటకు నెలకు రు. 450/—ల మీద లేక 35% కమిషను మీద ఇండియా అంతటా పూర్తిటైం పార్టుటైం అభ్యర్థులు పురుషులు స్త్రీలు కావలెను. శాంపిల్ సెట్టుకు వ్రాయండి:



**Employment Officer (APWM-88),**
**Box 1564, Delhi-6**

స్టేన్స్ సంస్థ 110 సంవత్సరాల పైగా వర్థిల్లుచున్నది. కాఫీ మా వ్యాపారం. బాగా స్థాపితమైన మా బ్రాండ్ నే ప్రతి ఇంటివారు అడుగుచున్నారు. అందువలన వారుకోరునది

నిస్సందేహంగా

స్టేన్స్ Stanes




రెడ్ లేబిల్ (ప్యూర్ డార్క్ రోస్టు)

రెడ్ఎన్‌సైన్ (ప్యూర్ ప్లేంటేషన్ లైట్ రోస్ట్)

స్టేన్స్ ఫ్రెంచ్ (డార్క్ లేక లైట్ రోస్ట్ చికరీతో బ్లెండ్ చేయబడినది)

తయారుచేయువారు:
దియునైటెడ్ కాఫీ సప్లయి కొ. లిడ్.
కోయంబత్తూరు.




పువ్వుల్లాంటి రోజులు కాలపురుషుని రథచక్రాల్లో పడి నలిగిపోతున్నాయి. అప్రయోజకమైన గతానికి, అనూహ్యమైన భవితవ్యానికి పాణిగ్రహణం చేయాలని అల్పాయుర్మూర్తి నిశిత వర్తమానం వ్యర్థప్రయత్నాలు చేస్తోంది. ఏమంటే 'వ' మాట్లాడి 'ర్త' మాట్లాడేసరికి 'వ' భూతమయిపోతుంది! అంత భూతాన్ని తనలోనే పెట్టుకొన్న ఈ 'మానం' ఆ సారథ్యానికి పనికిరాదని దానికి తెలియదు, పాపం!

ఆ రోజునే సెకండ్ క్వార్టర్లీ పరీక్షలు గట్టెక్కాయి. వాసు ఒక్కసారి బండరాళ్ళ కింద దింపినవాడిలా మెడలు విరుచుకొని, తల తడుముకున్నాడు. సెలవులకు ఇంటికి వెళ్ళిపోయాడు, ట్రెయిన్‌లో సరోజ, రామనాథంగార్లను కలుసుకొని మాట్లాడుతూ.

* * *

సెలవుల్లో ఓ రోజది. శ్రీనివాసరావుగారు హాండ్ స్టిక్ ఊపుకుంటూ వచ్చి "వాసూ! డ్రెస్సప్. పెళ్ళి చూపులకి వెళ్ళాలి. ఇంక టయిం లేదు. ఊఁ క్విక్!" అని తొందరపెట్టారు.

"ఉండు నాన్నా! అర్ధాంతరంగా ఇలా ఉక్కిరిబిక్కిరి చేస్తే ఎలా చెప్పు?" అంటూ కోటు వేసుకొని, బూటు తొడుక్కుంటూ అనునయపూర్వకంగా అన్నాడు.

"ఎక్కడికి?" అనికూడా అడక్కుండా బయలుదేరా డాయనవెంట. అది ఆ తండ్రీకొడుకుల ఆంతర్యం.

అది మధ్యేమార్గం!

"నాన్నా! పెళ్ళికూతురెవరు? నీకు నచ్చిందా?" ఆత్రంగా అడిగాడు వాసు.

"అదేరా! రామనాథంగారమ్మాయి. మాంచి తెలివైంది." హుషారుగా మీసం దువ్వుతూ నవ్వారు. వాసుకి 'అమృతభాండం నెత్తిమీద బద్దలయిందా!' అనిపించింది.

"మా మంచి ఫాదర్!" అని అభినందించాడు శ్రీనివాసరావుగారిని.

"ఒరేయ్! కంగారుపడకురా!" నవ్వారు.

"సరేగాని, నాన్నా, ఈ గొడవలన్నీ ఎప్పుడు మాట్లాడారు?"

"ఎప్పుడేమిటి చచ్చుప్రశ్న. మొన్న రామనాథంగారు వచ్చినప్పుడు."

"అందుకా ఆయన ఇక్కడికి వస్త!"

"మరే. . ."

రిక్షా రామనాథంగారి ఇంటిముందు ఆగింది. వాసు ఒక్క దూకు దూకాడు. ఎదురుగా రామనాథంగారు, సరోజ వచ్చి లోపలికి ఆహ్వానించారు. సరోజ ఇడ్లీ, కాఫీ లందించింది. నలుగురూ టిఫిన్ చెయ్యడం మొదలుపెట్టారు. కాఫీ తాగుతున్న వాసు కళ్ళు అప్రయత్నంగా కర్టెన్ వెనక ఉన్న ఓ అందాలరాశిమీద పడ్డాయి. వెంటనే "ఎవరామె?" అన్నాడు సరోజను పలకరిస్తూ.

"మా చెల్లెలు విరజ. హైదరాబాద్‌లో పి.యు.సి. చదువుతూంది."

"ఓ. . . అలానా?"

"ఎలా ఉందిరా అమ్మాయి?" శ్రీనివాసరావుగారి రామబాణంలాంటి ప్రశ్న.

"ఏడిసినట్టుంది." అంతా లక్కపిడతల్లా నోళ్ళు వెళ్ళబెట్టి తెల్లబోయారు, ఇంకా ఏం కూస్తాడోనని

చూస్తూ.

"కాకపోతే? ఇన్నాళ్లబట్టి కాలేజీలో విడివడకుండా తిరిగిన మాకు మళ్లీ చూపులేమిటి? ఏమన్నా సరోజ మళ్లీపుట్టిందా?" పెదవివిరిచి వక్కుమన్నాడు, వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌లా, కాఫీకప్పు కిందపెడుతూ.

"ఒరేయ్, వాసూ! సరోజ కాదురా... విరజ..." శ్రీనివాసరావుగారు వాసు చెయ్యి గిల్లారు. సరోజ లేచి లోపలికి వెళ్లిపోయింది. వాసుకి కింకాంగ్‌లాంటి బలశాలి ముసుగురాయి పెట్టి తలమీద కొట్టినట్లయింది. అప్రయత్నంగా కోపం సూర్యుణ్ణి మబ్బు కమ్మినట్టు కమ్మింది. తన్ను వంచించిన సరోజను ఒక్కసారిగా గొంతు నులిమి చంపెయ్యాలనుకున్నాడు ఒథెల్లోలా. అలాగే శీతాకాలంలో మంచుగడ్డలా బిగుసుకు పోయాడు.

సరోజ నీలంచీరమీద ఎర్రని ఔర్లిన్‌రవిక వేసుకొని, ఉషోదయంలో వికసించిన రోజారజీలా బయటికి వచ్చి, పవిట సర్దుకుంటూ వాసువైపు తిరిగి చిన్నగా నవ్వింది. ఆ నవ్వు వాసుకి ప్రళయకాలంలో తటిల్లతలా ఉంది. 'నయవంచకి. కుటిల...' వంటి మాటల పోటులతో ఆమెను మనస్సులోనే ఖూనీ చేశాడు. పైకి మాత్రం నుసిగప్పిన నిప్పులా కూర్చుని, బుట్టలో తాచులా బుసకొడుతున్నాడు.

వీథిలో కారు హారన్ కొట్టింది.

"మరి వెళదామా?" రామనాథంగారు శ్రీనివాసరావు గారిని కదిపారు.

"లే నాన్నా... అలా వెళ్లివద్దాం." శ్రీనివాసరావు గారు వాసుని పిలిచారు.

"ఎక్కడికి?" వాసు గుహలో గంభీరంగా మూల్గినట్లు ప్రశ్నించాడు, చూస్తూ.

"ఎక్కడికేమిటి? స్టేషన్‌కి. మద్రాసునుండి పెళ్లికొడుకు వస్తున్నాడు అమ్మాయిని చూసుకోడానికి. మనం వెళ్లి రామనాథంగారికి సహాయంగా మంచి, మర్యాద చూడద్దూ. అందులోను వచ్చే పెళ్లికొడుకు డాక్టరయ్యె!"

వాసు సరోజని చూశాడు. సరోజ కొంటెగా నవ్వి తల వంచేసుకుంది. వాసు తోక లాగిన సింహంలా ఫీంకరించాడు. పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లి కారు ఫ్రంటుసీటులో కూర్చున్నాడు. మిగిలిన వాళ్లతోకూడా కారు కదిలింది.

'ఆడవాళ్లు పయోముఖ విషకుంభాలు. వీళ్లకి ప్రేమవంటి దేవతావస్తువులు కూడా తామరాకుమీద నీటిబిందువుల్లాంటివి. వాటికి నిలకడ లేదు. స్త్రీ, చంచల! సౌందర్యోపాసకురాలు! ఈవేళ ఒక సౌందర్యాన్ని ఆరాధిస్తే రేపు మరొకటి. వీళ్లు ఆడవాళ్లు కాదు. ఆడపులవాళ్లు. వీళ్లకు హృదయంలేదు. ఒకవేళ ఉన్నా వీళ్ల హృదయపు నాలుగు కవాటాల్లోంచి ద్వేషం, మోసం, అసత్యం, అన్యాయాలు నిరంతరం మురికి కాలవల్లా ప్రవహిస్తూ ఉంటాయి.

'సరోజ ఎంత దగా చేసింది? తన్ను నమ్మించి నమ్మక చేసింది. తనావేళ సాగరుటూరు మానేసి ఉంటే, లైట్లులేని గదిలో ఉండిఉంటే, పాఠాలు చెప్పేటప్పుడు సాహసించిఉంటే తనిలా బరితెగించి ఇంకొకడికోసం పొగలిగేదా! ఛీ ఛీ! బోడినిజాయితీ! ఈ సరోజా బి. ఎ. గారికా యం. బి. బి. ఎస్.? ఆ చచ్చు పి. యు. సి. దానికి నేనా? చస్తే ఒప్పుకోను..' అంతర్గత తర్కంతో వాసు ఎర్రగా కందగడ్డలా తయారయ్యాడు. కళ్లు నాలుగు రోజులు నిద్రాహారాలు మాని పేకాడి డబ్బు పోగొట్టుకున్న వానికళ్లల్లా ఉన్నాయి. కోపంగా వెనక్కి చూశాడు. తన్నే రెప్పవేయకుండా చూస్తున్న సరోజ కొంచెం సతమతమయింది. చిటపటమన్నాడు నిప్పుల్లో ఉప్పేసినట్టు.

కారు స్టేషన్ చేరింది. అందరు దిగారు.

నల్లటి సూటుమీద తెల్లటిమనిషి. కోటేరు వేసినట్టు ముక్కు. చెరిగి విశాలమైన ఫాలాన్ని చుంబిస్తున్న ముంగురులు — ఓ యువకుడు ఎదురుగా వచ్చాడు. అతని పక్కన ఓ కుర్రాడు లెదర్ సూట్‌కేసు పట్టుకున్నాడు. అతను గబగబా వచ్చి "రామనాథంగారి ఇల్లెక్కడో మీకు తెలుసా?" అని వాసుని ప్రశ్నించాడు.

"వీరే రామనాథంగారు." వాసు పేలవంగా చెప్పి తప్పుకున్నాడు. సరోజ ఆ అపరిచితుణ్ణి చూస్తూ కారులో కూర్చుంది.

"రండి! ఇంటికి వెళదాం." రామనాథంగారు ఆహ్వానించారు. అతను కార్లో కూర్చున్నాడు. ఆ కారు వాసు గుండెలా బారుమని అరిచింది.

మరికొన్ని నిమిషాల్లో కారు రామనాథంగారి బంగళా ముందు ఆగింది.

"రా నాన్నా! ఇంటికి పోదాం." వాసు విసుగ్గా కేకేశాడు.

"ఉండు, నాయనా! అప్పుడే ఏం మునిగి పోయింది? ఇంకా జరగవలసినవెన్నో ఉన్నాయ్."

"అయితే వాళ్లు చూసుకుంటారు. మన మెందుకు?"

"కొప్పడకురా.. వెళదాంలే.." సముదాయించ బోయారు.

"అలాకాదు. నేనీవేళ కాలేజీకి వెళ్లిపోవాలి. నాకు డబ్బు కావాలి. వచ్చి ఇయ్యి!"

శ్రీనివాసరావుగారేమీ మాట్లాడకుండా ఎం. బి. బి. ఎస్. పెళ్లికొడుకువైపు తిరిగారు.

"తమ పేరేమిటి?"

'ఏమిటీ పాడు పొకులాట, భృత్యాతిభృత్యుల్లా!' వాసు మనసులో మోహం చిట్లించాడు.

"శేషగోపాల్."

"బ్యూటిఫుల్ నేం!"

ఇంతలో సరోజ, విరజ ముస్తాబై వచ్చి సోఫాలో కూర్చున్నారు. ఇద్దర్నీ చూస్తూ శేషగోపాల్ మురిసి పోయాడు, అలాంటి సౌందర్యరాసుల్ని కన్న రామనాథం గారిని మనసులో అభినందిస్తూ. సరోజ వాసుని చూసి నవ్వింది. శేషగోపాల్ సరోజని చూసి నవ్వాడు. విరజ సిగ్గుతో తనలో తనే నవ్వుకుంది. వాసు వీళ్లందర్ని చూసి బారుమన్నాడు. అతని ఒంటిమీద తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్లుంది. చర్మం కోసుకొని కారం రాసుకున్నట్లనిపించింది. వికసించిన మల్లెను ప్రచండ భానుడు చూసినట్లు చూశాడు సరోజను. సరోజ మళ్లీ నవ్వింది తెల్లగా. వాసు రుసరుసా బయటికి వెళ్లిపోయాడు, తన కోపాన్ని కృత్రిమహాసంతో కప్పుకుంటూ.

సరోజ, విరజ కాఫీలు తెచ్చి అందించారు. విరజ శేషగోపాల్‌కి అందివ్వబోయింది. శేషగోపాల్ చిన్నగా నవ్వుతూ ఆమె వేళ్లు నొక్కాడు. విరజ టచ్ మీ నాట్ ఫ్లవర్‌లా ముడుచుకుపోయింది. చీరకుచ్చెళ్లు కాళ్లతో తొక్కుకుంటూ లోపలికి పరిగెత్తుకు వెళ్లిపోయింది.

* * *

వాసు ఇంటికి వెళ్లి ఈజీచైర్‌లో పడుకొని సుదీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు. ఇంతలో శ్రీనివాస రావుగారు వచ్చి నవ్వుతూ ఓ కవరందించారు "తొందర పడి వచ్చేశావేరా?" అంటూ. వాసు చదవడం మొదలు పెట్టాడు.

"ప్రియ వాసూ!

నువ్వు నన్నపార్థం చేసుకున్నావని చెబితే కోపం రాదనుకుంటాను. నిన్ను ఉడికించి, ఊరించాలనే మేమలా చేశాం. నన్ను క్షమిస్తావు కదూ? ఇప్పుడు వచ్చిన శేషగోపాల్ విరజని పెళ్లిచేసుకోడానికి వచ్చాడుగానీ నిన్నూ, నన్నూ విడదీయడానికిమాత్రం కాదు. నేనెప్పుడూ నీదాన్నే. నాకు, విరజకు ఒక్కసారే



**వేట**

**ఫోటో—పి. ఎం. వరప్రసాదరావు (గుంటూరు—2)**

పెళ్లిచెయ్యాలన్న మా నాన్నగారి కోరిక ప్రకారం శేషగోపాల్ రెండో పెళ్లికొడుకుగా చూడ్డానికి వచ్చాడు. మరి నువ్వు మొదటి పెళ్లికొడుకుగా రావూ పెళ్లి చూపులకి!

మీ కోసం

సరోజ."

వాసుకి ఆనందబాష్పాలు గిర్రుమన్నాయి. 'ఎంత పని జరిగింది' అనుకున్నాడు.

"ఏం రాసిందిరా?" శ్రీనివాసరావుగారు నవ్వుతూ అడిగారు.

"నీకు తెలియదనే నన్నడుగుతున్నావా! పద, మళ్లీ పెళ్లిచూపులకి."

"నాకు పెళ్లిచూపు లేమిటిరా?"

"ఆఁ... నేను సరోజని చూసుకుంటాను. నువ్వు రామనాథంగారిని చూసుకుందువుగాని, రా.."

"నేను రాను. కాలేజీకి ఈవేళే వెళ్లాలి."

"అలాగేం ... నడు, కాలేజీలో జేరిపిస్తా" అంటూ ఆయన రెక్క పట్టుకొని హుషారుగా అంగలేసుకుంటూ రామనాథంగారి ఇంటికి దారితీశాడు వాసు. ★